నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల
వనపర్తి
5 | మహబూబ్‌నగర్, గురువారం 11 ఏప్రిల్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రంజాన్ పండుగకు ముస్తాబైన మసీద్

## చాంద్ దిఖా..

# ఈద్ ఆయా..

- నేడు ఈద్ ఉల్ ఫితర్
- పండుగకు సర్వం సిద్ధం
- ముస్తాబైన ఈద్గాలు
- ప్రార్థనల కోసం ఏర్పాట్లు
- ముగిసిన ఉపవాసాలు
- నెలరోజులపాటు ఆధ్యాత్మికత భావన

**ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ రానే వచ్చింది. బుధవారం సాయంత్రం నెలవంక తొంగి చూడగా.. గురువారం ఈద్ ఉల్ ఫితర్‌ను జరుపుకొనేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. పండుగ కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ముస్లింల ప్రత్యేక ప్రార్థనల కోసం ఉమ్మడి జిల్లాలోని ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు. ఖురాన్ అవతరించిన రంజాన్ మాసం గత నెల 12న ప్రారంభంకాగా ముస్లింలు ఆధ్యాత్మికతతో గడిపారు.**

*- నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ)*

ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ లేదా రమదాన్. నెల రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమ, నిష్టలతో చేపట్టిన ఉపవాస దీక్షలు బుధవారంతో ముగియనున్నాయి. దీంతో గురువారం రంజాన్ పండుగను గ్రామాలు, పట్టణాల్లో ముస్లింలు జరుపుకోనున్నారు. నెలవంక కనిపించిన గతనెల 12వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ మాసంలో ముస్లింలు అత్యంత కఠిన ఉపవాస దీక్షలను పాటించారు. తెల్లవారుజామున సహెర్, సాయంత్రం ఇఫ్తార్‌లకు మాత్రమే పరిమితమయ్యారు. పచ్చి మంచినీళ్లు ముట్టుకోకుండా అల్లాహ్ చింతనలో గడుపుతూ వచ్చారు. మానవాళికి ముక్తిమార్గం చూపించేందుకు అల్లాహ్ పంపిన పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించిన మాసంగా భావిస్తారు. కాగాముందుగా రమదాన్ అనేది ఒక నెల. చాలా వరకు తెలియని వాళ్లు రంజాన్ అంటారు. ఈ మాసంలో గ్రంథం పఠనానికి ప్రాధాన్యత ఇచ్చారు. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతలు ప్రభావం చూపిస్తున్నా రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తూ, తమకు ఉన్నదాంట్లో పేదలకు దాన ధర్మాలు చేశారు. అలాగే పలువురు సైతం ముస్లింలకు ఇఫ్తార్‌లు ఏర్పాటు చేసి సర్వమత సమ్మేళనాన్ని చాటుకొన్నారు. ఇక ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ మాసంలో ముస్లింలతో పాటుగా హిందువులందరూ ఇష్టపడే హలీం, హరీస్ వంటకాలను అందరూ టేస్ట్ చేశారు. రుచితో పాటు మంచి ఆరోగ్యకరమైన హలీం రుచుల కోసం మరో ఏడాది వేచి చూడాల్సిందే.. ఈ ఉపవాస దీక్ష మనిషిలోని చెడు భావాన్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతుందని ముస్లింల నమ్మకం. ఈ మాసంలో స్వర్గం తెరిచి ఉంటుందని నమ్మకం. ఈ మాసంలో చనిపోతే నేరుగా స్వర్గానికి వెళ్తారని వారు భావిస్తారు. అలాంటి పవిత్ర ఉపవాస దీక్షలు నెల రోజులు ముగిశాక రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు.

### సర్వం సిద్ధం..

రంజాన్ పండుగ ఏర్పాట్లకు ఆయా మున్సిపాలిటీలు, గ్రామాల్లో అధికారులు, ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాట్లు చేశారు. ప్రార్థనలు చేసేందుకు ఈద్గాల వద్ద చదును చేయించారు. నీళ్లు, టెంట్లలాంటి ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక ప్రార్థన కోసం ముస్లింలు భారీగా హాజరు కానున్నారు. అలాగే ఎమ్మెల్యేలు, ఇతర హిందూ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం పాల్గొని ముస్లింలకు ఈద్ ముబారక్ తెలియజేయనున్నారు. ఈ కారణంగా పోలీసులు సైతం బందోబస్తు ఏర్పాట్లు చేపట్టనున్నారు. మొత్తం మీద పవిత్ర రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొనేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు.



గోపల్‌దిన్నె రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

## తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు

- వేసవిలో శాశ్వత పరిష్కారానికి చర్యలు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, ఏప్రిల్ 10 : ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా తాత్కాలికంగా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నామని, వేసవిలో శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో నీటినిల్వలను మంత్రి పరిశీలించారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి వీపనగండ్ల, పాన్‌గల్, చిన్నంబావి మండలాలకు సంబంధించి 38 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు తీసుకోవాల్సిన తాత్కాలిక చర్యలపై సంబంధిత అధికారులతో మంత్రి మాట్లాడారు. వేసవిలో శాశ్వత పరిష్కారం కోసం తాగునీటి అవసరాల కోసం కనీసం 5 టీఎంసీలను విడుదల చేయాలని ముఖ్యమంత్రి ద్వారా కర్ణాటక ప్రభుత్వాన్ని కోరామన్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 0.4 టీఎంసీ మాత్రమే అందుబాటులో ఉన్నందున గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు 0.1 టీఎంసీని వినియోగించుకొని తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నీటినిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నందున వ్యవసాయానికి నీటిని వాడకుండా రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ఎత్తం కృష్ణయ్య, గంగిరెడ్డి, వెంకటయ్య, కురుమయ్య, రవీందర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, జ్యోతీశ్వర్ గౌడ్, రంజిత్‌కుమార్, గోపి, బాలు, మహేశ్, విష్ణు, భరత్ పాల్గొన్నారు.

## స్నేహితుడిని కాపాడేందుకు వెళ్లి..

- బావిలో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు
- మునిగిపోతున్న దోస్తును కాపాడే యత్నంలో ఇద్దరూ మృతి




శివకుమార్, గణేశ్ (ఫైల్)

దేవరకద్ర, ఏప్రిల్ 10 : ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన దేవరకద్ర పట్టణంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్సై నాగన్న కథనం మేరకు.. మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూర్ గ్రామానికి చెందిన అంజమ్మ, వెంకటయ్యల రెండో కుమారుడు శివకుమార్(22), యశోద, ఊషన్నల రెండో కుమారుడు గణేశ్ (22) ఇద్దరు స్నేహితులు కావడంతో ఉగాది పండుగకు గ్రామానికి వచ్చారు. గణేశ్ హైదరాబాద్‌లో డిప్లొమా చదువుతుండగా.. శివకుమార్ కొత్తకోటలోని ఓ ప్రైవేట్ కంపెనీలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కరి పండుగ ఉండడంతో సరదాగా గడిపేందుకు దేవరకద్రలోని కన్నయ్య బావిలో ఈత కోసం వెళ్లారు. శివకుమార్ బావిలో దిగి ఈత పడుతుండగా గణేశ్‌కు ఈత రాకపోవడంతో తర్వాత బావిలోకి దిగాడు. గణేశ్ మునిగిపోతుండడంతో గ్రహించిన శివకుమార్ కాపాడేందుకు ప్రయత్నించగా ఇద్దరు నీటిలో మునిగి మృతి చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతోపాటు యువకుల మృతదేహాలను బావి నుంచి బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. దీంతో కోడూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

## హోంగార్డుపై ఎస్‌ఆర్వో దౌర్జన్యం



హోంగార్డు చేతుల్లోంచి ఫోన్ లాక్కుంటున్న ఎస్‌ఆర్వో

మద్దూర్(కొత్తపల్లి), ఏప్రిల్ 10 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా అడ్డుకున్న హోంగార్డుపై ఎస్‌ఆర్వో దౌర్జన్యం చేసి దుర్భాషలాడిన ఘటన మండలంలోని దోరేపల్లిలో చోటు చేసుకున్నది. బుధవారం లింగల్‌చేడ్ వాగులో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఆర్వో ఆంజనేయులు తన స్వగ్రామమైన దోరేపల్లిలో అధికారుల అండదండలతో వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అటుగా వెళ్తున్న హోంగార్డు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకొన్నాడు. దీంతో ఎస్‌ఆర్వో ఇసుక ట్రాక్టర్ అడ్డుకోవడానికి నీవెవరంటూ ప్రశ్నించడమే కాకుండా హోంగార్డు కాలర్ పట్టుకొని దౌర్జన్యం చేసి అతడి చేతిలో ఉన్న మొబైల్‌ను పగులగొట్టాడు. అంతే కాకుండా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అనే రీతిలో వ్యవహరించి ట్రాక్టర్‌ను అక్కడి నుంచి తప్పించాడు.



అమ్మటోనిపల్లిలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

## అప్పులు తీర్చలేకే..

# ఆత్మహత్యలు



అమ్మటోనిపల్లిలో ఎండిన వరి పంట

హన్వాడ, ఏప్రిల్ 10 : వేసిన పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోవడంతోనే పంట సాగు కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారి కుటుంబాల్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కరువు వచ్చిందని ఆరోపించారు. బుధవారం మండలంలోని అమ్మటోనిపల్లి గ్రామంలో ఎండిన వరి పంటలను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంత సాగు చేశారు.. ఎంత ఎండిపోయింది.. పంట సాగు చేసేందుకు ఎంత ఖర్చు చేశారని రైతుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ మండలంలో 50శాతం వరకు పంటలు ఎండిపోయాయి. పంట సాగు చేసేందుకు ఎకరాకు రూ.30వేలు ఖర్చు అయ్యిందని, చేతికొచ్చే సమయంలోనే పంటలు ఎండిపోవడంతో రైతులు ఏమి చేయాలో తోచక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలు రోడ్డుపై పడ్డాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేండ్లు అధికారంలో ఉంటే ఒక్క పంట కూడా ఎండిన దాఖలాలు లేవు. కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి సాగునీరు, ఉచిత కరెంటు, పంట పెట్టుబడి, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిచడం జరిగిందని గుర్తు చేశారు. ప్రమాదవశాత్తు రైతు చనిపోతే వారి కుటుంబానికి రూ.5లక్షల బీమా ఇచ్చి ఆదుకున్నట్లు వివరించారు. ఇలాంటి పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెడుతున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత నీళ్లులేవు, కరెంట్ లేదు, రైతుబంధు, రైతుబీమా లేక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని వాపోయారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు రూ.2లక్షల రుణమాఫీ, రైతు బంధు రూ.15 వేలు, వడ్లకు మద్దతు ధరతోపాటు రూ. 500 బోనస్, రైతు కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు ఇస్తామని చెప్పిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని సూచించారు. తాగునీటి కోసం కూడా ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రభుత్వం వెంటనే తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవడంతోపాటు ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంపీ మన్నె మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు పంటలు పరిశీలించడం లేదని, రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా పంటలు పుష్కలంగా పండాయని, ఆ పరిస్థితులు ఏమయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, మీ తరఫున బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని, మీకు అండగా నిలుస్తుందన్నారు. అందుకే రైతులను ఆదుకోని కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ నరేందర్, మాజీ వైస్ ఎంపీపీ కొండా లక్ష్మయ్య, ఎంపీటీసీలు వడ్ల శేఖర్, అరుణ్, చెన్నయ్య, మల్కయ్య, నాయకులు జంబులయ్య, రమణారెడ్డి, బసిరెడ్డి, యాదయ్య, చెన్నయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సగం పంట ఎండింది..



నేను మూడు ఎకరాలల్లో వరిపంటను సాగు చేస్తే ఎకరన్నర పంట ఎండిపోయింది. వరి సాగు చేసేందుకు ఎకరాకు రూ.30 వేలు ఖర్చు అయింది. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోయింది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం కూడా అందించలేదు. పదేండ్లలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదు. ప్రభుత్వం పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలి.

*- రాములు, రైతు, అమ్మటోనిపల్లి*

- కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది..
- రైతుబంధు, రైతుబీమాకు ఎగనామం పెట్టింది
- పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- అమ్మటోనిపల్లిలో ఎండిన వరి పంటల పరిశీలన

# రోడ్ టెర్రర్

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి
- నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఘటనలు

బిజినేపల్లి, ఏప్రిల్ 10 : తుఫాను డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో పది మందికి గాయాలైన ఘటన బిజినేపల్లిలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రానికి చెందిన 13మంది శివ భక్తులు తుఫానులో శ్రీశైలం నుంచి బిజినేపల్లి మీదుగా కర్ణాటకకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున తుఫాన్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బీజాపూర్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన వందన (55) అక్కడికక్కడే మృతి చెందగా, భారతి (44) నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అదేవిధంగా దేవేందర్, మహాదేవి, దానమ్మ, నాగవ్వ, ధన్పాల్, సావిత్రి, అనిత, మల్లమ్మ, మల్లప్పకు గాయాలయ్యాయి. వీరిలో ఏడుగురిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

### బైకు, కారు ఢీ..

వనపర్తి టౌన్, ఏప్రిల్ 10 : బైకు, కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకున్నది. వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా ధర్మాపూర్‌కు చెందిన వెంకటేశ్, జడ్చర్లకు చెందిన రవికుమార్ వనపర్తి నుంచి మోటర్ సైకిల్‌పై కొత్తకోటకు వెళ్తున్నారు. కొత్తకోట నుంచి వనపర్తికి వస్తున్న కారుకు ఎదురుగా కుక్క రావడంతో సడన్ బ్రేక్ వేయగా అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో రెండు వాహనాలు రోడ్డుకిందకు దూసుకెళ్లాయి. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వెంకటేశ్, రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఘటనాస్థలిని సీఐ నాగభూషణ్‌రావు పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు.




ఆయిల్‌పాం పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## ఆయిల్‌పాం సాగు లాభదాయకం

- కేసీఆర్ ప్రభుత్వంలో రెండు లక్షల ఎకరాల్లో తోటలు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

కొత్తకోట, ఏప్రిల్ 10 : సంప్రదాయ పంటలతోపాటు వాణిజ్య పంటలపై రైతులు దృష్టి సారిస్తే అధిక లాభాలు పొందొచ్చని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కొత్తకోట మండలంలోని పాత జంగమాయపల్లిలో రైతు లక్ష్మీకాంత్‌రెడ్డి 24 ఎకరాల్లో వేసిన ఆయిల్‌పాం మొక్కలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆధునిక పద్ధతులను వివరించడంతోపాటు ప్రతి మొక్కనూ పరిశీలించాలని లక్ష్మీకాంత్‌రెడ్డికి సూచించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ నలభై ఏండ్లల్లో దాదాపు 50వేల సాగు విస్తీర్ణం ఉంటే కేసీఆర్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షలకు పైగా ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలను అభివృద్ధి చేశామన్నారు. ఒక ఎకరా వరి పెట్టుకుంటే అందుకు అయ్యే ఖర్చుతో 4 ఎకరాల్లో ఆయిల్‌పాం తోట పెట్టుకోవచ్చన్నారు. సంకిరెడ్డిపల్లి శివారులో ఆయిల్‌పాం కంపెనీకి శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. రైతుల దగ్గరకు కంపెనీ వారు వచ్చి ఆయిల్‌పాం కాయలను కొనుగోలు చేస్తారని, అంతే కాకుండా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన వివరించారు.



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌ఎస్‌పీ

కల్వకుర్తి, ఏప్రిల్ 10 : మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను బుధవారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి కల్వకుర్తి నియోజకవర్గంలో 35వేల మెజార్టీ లభించిందని, ఇప్పుడు జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గతం కన్నా మరింత ఎక్కువ మెజార్టీ వచ్చే విధంగా ముందుకు సాగుదామని జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## చౌటపల్లిలో నీటి సమస్య పరిష్కారం

- పైప్‌లైన్‌కు మరమ్మతులు
- నీటి సరఫరా ప్రారంభం




చౌటపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 10 : మండలంలోని చౌటపల్లి గ్రామంలో అధికారులు, సిబ్బంది నీటి సమస్యను పరిష్కరించారు. గత మంగళవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం డీఎల్‌పీవో పండరీనాథ్ ఆధ్వర్యంలో అధికారులు చౌటపల్లికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. నీటి సమస్య రావడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. లింగంపల్లి వద్ద మిషన్‌భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతోనే నీటి సరఫరా నిలిచిపోయిందని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి కల్పన, మిషన్ భగీరథ సిబ్బంది స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి సరఫరాను ప్రారంభించారు. మరమ్మతు పనులు పరిశీలించిన వారిలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో భద్రునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షమాయుల్లాఖాన్, వాటర్ గ్రిడ్ అధికారులు ఉన్నారు.

SVS హాస్పిటల్ మహబూబ్‌నగర్
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలందరికి ఉగాది మరియు రంజాన్ శుభాకాంక్షలు.
అధునాతన MRI 3.0 Tesla నూతన స్కాన్!


మెషిన్, SVS హాస్పిటల్ లో ఏర్పాటు చేయబడినది. ఈ స్కాన్ ద్వారా శరీరంలో సూక్ష్మాతి, సూక్ష్మమైన లోపాలను తక్కువ సమయంలో గుర్తించబడును. అనుభవజ్ఞులైన రేడియాలజిస్టులచే రిపోర్ట్ త్వరగా ఇవ్వబడును.
- MRI Any Scan - ~~5500/-~~ - 3500/- Only
- MRI Whole Spine - ~~6000/-~~ - 4000/- Only
గమనిక : ఈ స్కాన్ మెషిన్ బోర్ డయా పెద్దదిగా ఉండడం వలన పేషెంట్‌కు స్కాన్ చేసేటప్పుడు భయం కలగదు.
వివరాలకు : ఈ 6303444232 / 7893888529 నెంబర్ల పై సంప్రదించగలరు.
Dept of Radiology
SVS Medical College Hospital